# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 29-08-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ఆత్మనిర్భర్ భారత్ లక్ష్య సాధనకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు ప్రభావవంతమైన పాత్ర పోషిస్తున్నాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.

- ❖ జపాన్ సాంకేతికత, భారతదేశం ప్రతిభ కలయికతో ఈ శతాబ్దంలోనే సరికొత్త సాంకేతిక విప్లవానికి నాంది పలుకుతాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు.

- ❖ ఆరోగ్య సంరక్షణలో దేశం స్వావలంబన సాధించడానికి భారత మెడ్‌టెక్ పరిశ్రమ చేస్తున్న కృషి ప్రశంసనీయమని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ అన్నారు.

- ❖ చట్ట సభలలో అర్ధవంతమైన చర్చలు జరగాలని లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా ఆకాంక్షించారు.

- ❖ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని దేశ వ్యాప్తంగా మూడు రోజుల పాటు జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకుంటున్నారు.

==========================

ఆత్మనిర్భర్ భారత్‌ను నిర్మించే క్రమంలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు ప్రభావవంతమైన పాత్ర పోషిస్తున్నాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. న్యూఢిల్లీలో ఈ రోజు ప్రభుత్వ రంగ సంస్థలకు 2022-23 SCOPE ఎమినెన్స్ అవార్డులను రాష్ట్రపతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు గడచిన దశాబ్దాలలో దేశం ప్రగతి మార్గాన సాగేందుకు తమ వంతు పాత్రను పోషిస్తు వచ్చాయని చెప్పారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించాలనే జాతీయ లక్ష్యాన్ని సాధించడంలో కేంద్రప్రభుత్వ రంగ సంస్థలు కీలక పాత్ర పోషిస్తాయని రాష్ట్రపతి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు దేశ అభ్యున్నతికి ముఖ్యమైన సహకారాన్ని అందిస్తున్నాయని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

జపాన్ సాంకేతికత, భారతదేశం ప్రతిభ కలయికతో ఈ శతాబ్దంలోనే సరికొత్త సాంకేతిక విప్లవానికి నాంది పలుకుతున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. జపాన్ రాజధాని టోక్యోలో జరిగిన 15వ భారత్, జపాన్ ఆర్థిక వేదికను ఉద్దేశించి ఈ రోజు ప్రధానమంత్రి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జపాన్ సాంకేతికతకు శక్తి అని, భారతదేశం ప్రతిభకు శక్తి అని అభివర్ణించారు. భారతదేశం సెమీకండక్టర్లు, క్వాంటం కంప్యూటింగ్, బయోటెక్నాలజీ వంటి వాటిలో ప్రయోగాలు చేపడుతోందని గుర్తు చేశారు. భారత్ అభివృద్ధి ప్రయాణంలో జపాన్ కీలక పాత్ర పోషించిందని నరేంద్ర మోదీ వివరిస్తూ...

(వాయిస్ 35 సెకన్లు)

ఈ సదస్సులో పాల్గొన్న జపాన్ ప్రధానమంత్రి షిగేరు ఇషిబా మాట్లాడుతూ... అనేక జపాన్ కంపెనీలు మేక్ ఇన్ ఇండియాలో కీలక పాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. అంతకు ముందు టోక్యోకు చేరుకున్న ప్రధానమంత్రికి ప్రవాస భారతీయులు ఘన స్వాగతం పలికారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

చట్ట సభలలో అర్థవంతమైన చర్చలు జరగాలని లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా ఆకాంక్షించారు. ఎస్సీ, ఎస్టీల సంక్షేమంపై చర్చించేందుకు ఏర్పాటు చేసిన  పార్లమెంట్, రాష్ట్రాల శాసనసభల కమిటీ అధ్యక్షుల జాతీయ సమావేశాన్ని ఒడిషాలోని భువనేశ్వర్‌లో ఆయన ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రజా సమస్యలకు సంబంధించిన అంశాలపై సభ్యులు చట్టసభలలో ప్రస్తావించాలని కోరారు. చట్ట సభల సమావేశాల సంఖ్య తగ్గడం పట్ల లోక్ సభ స్పీకర్ ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా సభలలో సభ్యులు చర్చలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆరోగ్య సంరక్షణలో దేశం స్వావలంబన సాధించడానికి భారత మెడ్‌టెక్ పరిశ్రమ చేస్తున్న కృషి ప్రశంసనీయమని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన 17వ.. CII గ్లోబల్ మెడ్‌టెక్ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... COVID-19 మహమ్మారి సమయంలో భారత మెడ్‌టెక్ పరిశ్రమ చేసిన కృషి గుర్తించతగినదని తెలిపారు. సరసమైన ధరకు అధిక నాణ్యత గల వైద్య పరికరాలను అందించడంలో మెడ్‌టెక్ పరిశ్రమ ప్రపంచ స్థాయికి ఎదగాలని కేంద్రమంత్రి ఆకాంక్షించారు. వైద్య రంగంలో పరిశోధనలు, ఆవిష్కరణలకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని తెలిపారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో నేర పరిశోధనా వ్యవస్థలో ఫోరెన్సిక్ ఆధారిత విధానానికి ప్రభుత్వం అధిక  ప్రాధాన్యత ఇస్తోందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెల్లడించారు. అసోంలోని  గౌహతిలో కొత్తగా నిర్మించిన రాజ్ భవన్ లోని బ్రహ్మపుత్ర విభాగాన్ని కేంద్ర మంత్రి ఈ రోజు ప్రారంభించారు. అదే విధంగా గోలాఘాట్‌లో జాతీయ సైబర్ ఫోరెన్సిక్ ఇ-లేబొరేటరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సైబర్ భద్రత, ఫోరెన్సిక్ సైన్స్ అన్నవి దేశ పౌరులకు చాలా ముఖ్యమైనవని గుర్తు చేశారు. ఈ కొత్త వ్యవస్థ ఈశాన్య రాష్ట్రాలకు  దిక్సూచిలా పని చేస్తుందని కేంద్ర హోంమంత్రి తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ న్యూఢిల్లీలోని మేజర్ ధ్యాన్ చంద్ నేషనల్ స్టేడియంలో హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ రోజు నుండి మూడు రోజుల పాటు దేశవ్యాప్తంగా క్రీడలతో శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకునేందుకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. “ఏక్ ఘంటా.. ఖేల్ కే మైదాన్ మే..'' అనే అంశంతో ప్రముఖ క్రీడాకారులు, ప్రజా ప్రతినిధులు.. జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలలో పాల్గొంటారని కేంద్ర మంత్రి పేర్కొంటూ..

(వాయిస్ 32 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మహిళల కోసం “ముఖ్యమంత్రి మహిళా ఉపాధి” పథకాన్ని బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఈ రోజు ప్రకటించారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబంలోని మహిళ తనకు నచ్చిన ఉపాధిని కల్పించుకునేందుకు ఈ పథకం ద్వారా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందని సామాజిక మాధ్యమం ద్వారా ఆయన తెలిపారు. ఈ పథకానికి సంబంధించి దరఖాస్తుల ప్రక్రియను పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ శాఖతో పాటు గ్రామీణాభివృద్ధి శాఖలు చేపడతాయని నితీష్‌కుమార్ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆధునిక భారతం యువత చేతుల్లో ఉందని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖా మంత్రి జ్యోతిరాదిత్య సింధియా పేర్కొన్నారు. ఢిల్లీలో ఈ రోజు నిర్వహించిన  ఐఐటి ఢిల్లీ టెక్ ఫెస్ట్ లో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రానున్న వందేళ్ళ కాలం భారతదేశానిదే అని స్పష్టం చేశారు. భారత్ విశ్వగురువుగా ఏనాటి నుంచో  ఉందని గుర్తు చేశారు. ఆర్యభట్టు సున్నాను కనుగొన్నారని, అలాగే వైద్య శాస్త్రంలో పురోగతి అంతా భారతదేశం నుంచి సాగిందని చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 125వ సంచిక ఈ ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.. “మన్ కీ బాత్” తెలుగు అనువాదం ప్రధానమంత్రి ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, తిరిగి రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల ద్వారా ప్రసారం కానుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ తీర ప్రాంతంలో రానున్న 24 గంటల వరకు భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (ఐంఎడీ) వెల్లడించింది. అదే విధంగా హిమాచల్ ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, తెలంగాణ,, ఆంధ్రప్రదేశ్, ఒడిసాతో పాటు ఈ శాన్య రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఆ వివరాలను వాతావరణ శాస్త్రవేత్త రఘు నడింపల్లి తెలియజేస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =